సాక్షి
ఖమ్మం
సోమవారం । 5 । మే । 2025



కాల్వలు అధ్వానం..

ఎన్నెస్పీ కాల్వలు పదేళ్లుగా మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా తయారయ్యాయి. పూడికతో నీటి సరఫరా సాగడం లేదు. 10లో



తక్కువ ధరకు బంగారం అంటూ..

తక్కువ ధరకు ఎక్కువ బంగారం అంటూ ఆశచూపి రూ.10 లక్షలు చోరీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 10లో



వాతావరణం

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్నిచోట్ల ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

ప్రశాంతంగా నీట్

- జిల్లాలో 6 కేంద్రాలు, 2,739 మంది విద్యార్థులు
- ఉదయం 11 గంటలకే పరీక్ష కేంద్రాల వద్దకు..
- చివరి నిమిషంలో కొందరి ఉరుకులు.. పరుగులు



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

ఖమ్మం సహకారనగర్ : 2025 – 26 విద్యా సంవత్సరానికి దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆదివారం నిర్వహించిన నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రెన్స్ టెస్ట్) జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఖమ్మం నగరంలో ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 2,739 మంది విద్యార్థులకు గాను 2,671 మంది హాజరయ్యారు. 68 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగింది. పరీక్ష కేంద్రాల్లోకి ఉదయం 11 గంటల నుంచే అనుమతిస్తామని అధికారులు ముందుగానే ప్రకటించారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు 10.30 గంటల నుంచే కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులను కేంద్రాల్లోకి పంపించే సమయంలో పోలీస్ సిబ్బంది, ఇతరులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నగరంలో అడిషనల్ డీసీపీ, ఇతర పోలీసులతో పాటు, పలు శాఖల సిబ్బంది విద్యార్థులు, తల్లిదండ్రులకు సూచనలు, సలహాలు అందించారు.

ఉరుకులు.. పరుగులు

మధ్యాహ్నం 1.30 గంటల వరకే పరీక్షకు అనుమతిస్తామని అధికారులు ముందుగానే ప్రకటించినా, హాల్ టికెట్లపై నిబంధనలు పొందుపర్చినా ఒకరిద్దరు విద్యార్థులు చివరి క్షణంలో ఉరుకులు, పరుగులతో హాజరయ్యారు. నగరంలోని ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల, యూనివర్సిటీ పీజీ కళాశాల పరీక్ష కేంద్రాలు పక్కపక్కనే ఉండడంతో కొందరు అటువారు ఇటు, ఇటువారు అటు రావడంతో అధికారులు ఆయా కేంద్రాలకు వెళ్లేలా సూచనలు చేశారు. ఇక ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రానికి ఓ విద్యార్థిని 4 నిమిషాలు ఆలస్యంగా రావడంతో అధికారులు వెనక్కు పంపించారు. ఇతర కేంద్రాల వద్ద కూడా ఆలస్యంగా వచ్చిన వారికి అనుమతించలేదు.

పరీక్ష రాసిన తల్లీకూతుళ్లు..

ఖమ్మం నగరానికి చెందిన తల్లీ కూతుళ్లు నీట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. తల్లి బి.సరితకు సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, కూతురు బి.కావేరికి ఖమ్మం ఎన్నెస్పీ కాలనీ ప్రభుత్వ పాఠశాల కేంద్రాల్లో పరీక్ష రాశారు.

పిల్లలతో పరీక్ష కేంద్రానికి ఎమ్మెల్యే..

సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ఇద్దరు పిల్లలు నీట్ రాయగా వారిని ఆమె కేంద్రాల వద్దకు తీసుకెళ్లారు. ఒకరికి ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల పరీక్షా కేంద్రం కాగా.. మరొకరికి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కేటాయించారు.

పరీక్ష బాగా రాశాను



నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో పరీక్ష రాశాను. మొత్తం 720 మార్కులకు గాను మంచి మార్కులు వస్తాయనే నమ్మకం ఉంది. బోటనీ, జువాలజీ బాగా రాశాను. ఫిజిక్స్ సబ్జెక్ట్ రాసేందుకు సమయం సరిపోలేదు. ప్రశ్నలు ఇన్‌డైరెక్ట్ మెథడ్‌తో రావడంతో పాటు ప్రశ్నాపత్రం లెంథీగా(పెద్దగా) వచ్చింది. దీంతో ఆలోచించి పరీక్ష రాయాల్సి వచ్చింది.

– ఆదిబా ఫర్హీన్, విద్యార్థిని

ప్రశ్నపత్రం కఠినంగా ఉంది



నీట్‌లో కొన్ని సబ్జెక్టులు కఠినంగా వచ్చాయి. బోటనీ సులభంగా ఉండగా జువాలజీ పర్వాలేదు. ఫిజిక్స్ కఠినంగా వచ్చింది. దీంతో పాటు ప్రశ్నలు పెద్దగా ఉండడంతో ఎక్కువ సమయం పట్టింది. కెమిస్ట్రీ కూడా కొంత కఠినంగానే ఉంది. ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ పరీక్ష ప్రశాంతంగా రాశా. మంచి మార్కులు వస్తాయనే నమ్మకం ఉంది.

– కొల్ల సాయిజశ్వంత్

న్యూస్‌రీల్

తేమ శాతం రాగానే కొనుగోలు చేయాలి



ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

వైరా: కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యంలో తేమ శాతం సరిపడా రాగానే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. మండలంలోని స్నానాల లక్ష్మీపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, వైరాలో ఏఎంసీ, ఎంఎల్ఎస్ పాయింట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యంలో తేమ శాతాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని చెప్పారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి ఆవసరమైన వాహనాలు సంఖ్య పెంచాలన్నారు. మిల్లులు, కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీల కొరత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డబ్బు చెల్లించేలా చూడాలని ఆదేశించారు.

ధాన్యం తరలింపు వేగవంతం



ధాన్యాన్ని పరిశీలిస్తున్న చందన్‌కుమార్

ఖమ్మం సహకారనగర్ : జిల్లాలోని వివిధ మండలాల్లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తక్షణమే తరలిస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ తెలిపారు. నేలకొండపల్లి, ముదిగొండ, కూసుమంచి, కొణిజర్ల, సత్తుపల్లి, వైరా, తల్లాడ తదితర ప్రాంతాల నుంచి లారీల ద్వారా హన్మకొండ జిల్లా పంపించామని వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 1.11లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా, 21వేల మెట్రిక్ టన్నులు హన్మకొండ జిల్లాలోని మిల్లులకు తరలించామని తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

నెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్ : జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం ఖమ్మం రూరల్ మండలం పెద్ద వెంకటగిరి జెడ్పీ హైస్కూల్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి నెట్‌బాల్ బాలబాలికల సబ్ జూనియర్ జట్లను ఎంపిక చేశారు. జిల్లా వ్యాప్తంగా 30మంది బాలురు, 28మంది బాలికలు ఎంపికలకు హాజరయ్యారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు జనగామలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. బాలబాలికల జట్టుకు 24 మంది చొప్పున ఎంపిక చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.నాగేశ్వరరావు, స్కూల్ చైర్‌పర్సన్ శ్రీదేవి, జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు దీప్తి, కార్యదర్శి ఎస్.ఫణికుమార్, పీడీ పి.వి.వెంకటరమణ పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి



మాట్లాడుతున్న తమ్మినేని, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్ : ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని, మావోయిస్టుల పేరున ఆదివాసీలపై జరుపుతున్న దాడులను ఆపాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక సుందరయ్య భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది కాలంగా మావోయిస్టులను అంతం చేస్తామంటున్న కేంద్రం.. వివిధ ఆపరేషన్ల పేరుతో ఆదివాసీలపై దాడులు చేస్తోందని విమర్శించారు. శాంతి చర్చలకు సిద్ధమంటూ మావోయిస్టుల నుంచి రెండుసార్లు ప్రతిపాదనలు వచ్చినా పట్టించుకోకుండా అణచివేత చర్యలకు పాల్పడటం దారుణమని అన్నారు. మేధావులు, పౌరహక్కుల నేతలు మధ్యవర్తులుగా వ్యవహరిస్తామని చెప్పినా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం సరైంది కాదన్నారు. అడవుల్లో ఉన్న సహజ వనరులు, విలువైన ఖనిజాలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకే ఆపరేషన్ కగార్‌ను ఎంచుకుందని ఆరోపించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు బి.రమేష్, మాదినేని రమేష్, ఎం.సుబ్బారావు, మెరుగు సత్యనారాయణ, షేక్ బషీరుద్దీన్, పిన్నింటి రమ్య పాల్గొన్నారు.

పైలెట్.. సక్సెస్



బోదులబండలో దరఖాస్తులపై ఆరా తీస్తున్న ప్రత్యేకాధికారి (ఫైల్)

నేలకొండపల్లిలో విజయవంతమైన భూ భారతి

- 14 రోజులు 32 పంచాయతీల్లో రెవెన్యూ సదస్సులు
- 11 రకాల భూ సమస్యలపై 3,224 దరఖాస్తులు
- అత్యధికంగా సాదాబైనామా క్రమబద్ధీకరణకు 1,264..

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో పైలెట్ మండలంగా ఎంపికైన నేలకొండపల్లిలో భూభారతి కొత్త ఆర్‌ఓఆర్ చట్టం విజయవంతమైంది. 14 రోజుల పాటు రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలన్నీ ఒక దగ్గరకు చేర్చారు. 11 రకాల భూ సమస్యలపై ఈ సదస్సుల్లో రెవెన్యూ అధికారులకు 3,224 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ యంత్రాంగం ఆరు బృందాలుగా.. ఒక్కో బృందం నాలుగు రెవెన్యూ గ్రామాల్లో ఈనెల 15 వరకు దరఖాస్తులను పరిశీలన పూర్తి చేయాలి. ఆ తర్వాత తహసీల్దార్ నుంచి ఆర్డీఓకు క్లియరెన్స్ వస్తుంది. ఆ తర్వాత ఆర్డీఓ ప్రొసీడింగ్స్ ఇస్తారు. ఈ ప్రక్రియ అంతా పూర్తయిన తర్వాత దరఖాస్తుదారు ఇప్పటికే పాస్ బుక్ కలిగి ఉంటే అది నవీనీకరిస్తారు. లేదంటే కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకం జారీ చేస్తారు.

సదస్సులతో అవగాహన..

భూ భారతి అమలుకు రాష్ట్రంలో పైలెట్‌గా నాలుగు మండలాలను తీసుకోగా ఇందులో నేలకొండపల్లి కూడా ఉంది. ఈ పథకం అమలుకు ముందు అందరికీ అవగాహన కల్పించేలా ప్రభుత్వం సదస్సులకు శ్రీకారం చుట్టింది. ఈ మండలంలో గతనెల 17 నుంచి 30 వరకు 23 రెవెన్యూ గ్రామాల్లోని 32 గ్రామ పంచాయతీల్లో సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, ఆర్ఐ, సర్వేయర్, జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొని భూభారతి చట్టం విధి విధానాలు, పనితీరును వివరించారు.

దండిగా దరఖాస్తులు..

ఈ సదస్సులతో పాటు ప్రత్యేకంగా తహసీల్దార్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ పెట్టారు. రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు ఇవ్వలేని వారు ఈ హెల్ప్‌డెస్క్‌లో అందజేశారు. సదస్సుల్లో 2,690 దరఖాస్తులు రాగా హెల్ప్‌డెస్క్‌కు 534 అందాయి.

సాదాబైనామాకే ఎక్కువ..

11 రకాలకు సంబంధించిన భూ సమస్యలపై 3,224 దరఖాస్తులు రాగా, ఇందులో అత్యధికంగా సాదాబైనామా కింద క్రమబద్ధీకరణకు 1,264 అర్జీలు (40 శాతం) రావడం గమనార్హం. అయితే సీసీఎల్ఏ అందించిన డేటా ప్రకారం మండలంలో సాదాబైనామా క్రమబద్ధీకరణకు 3,417 దరఖాస్తులు ఉన్నాయి.

ప్రస్తుతం భూభారతి చట్టంలో సాదాబైనామా క్రమబద్ధీకరణకు సంబంధించి 2020 అక్టోబర్ 12 నుంచి నవంబర్ 10 వరకు అందినవి మినహా.. ఇతర దరఖాస్తులను ప్రాసెస్ చేయానికి ఎటువంటి నిబంధన లేదు. దీంతో మిగిలిన దరఖాస్తులను పక్కన పెట్టారు. ప్రభుత్వ అనుమతితో సీసీఎల్ఏ జారీ చేయబోయే నోటిఫికేషన్ అందిన తర్వాత ఈ దరఖాస్తులను ప్రాసెస్ చేసేందుకు డాక్యుమెంటరీ ఆధారాలను సమర్పించమని దరఖాస్తుదారులను కోరనున్నారు.

ఈనెల 15లోగా తనిఖీలు పూర్తి..

బృందాలు క్షేత్రస్థాయి తనిఖీ ప్రక్రియను ఈనెల 15లోగా పూర్తి చేస్తాయి. ఇందుకోసం షెడ్యూల్ రూపొందించుకుని గ్రామాలను సందర్శిస్తున్నాయి. వీటిపై ఏమైనా అభ్యంతరాలు వ్యక్తమై.. తదుపరి విచారణ అవసరమైతే ఈనెల 16 నుంచి 22 వరకు మరోసారి గ్రామాలను సందర్శిస్తాయి. ఆ తర్వాత ఖమ్మం ఆర్డీఓ, నేలకొండపల్లి తహసీల్దార్ అందించిన లాగిన్‌లో చేసిన సిఫార్సుల ఆధారంగా ఈనెల 25 నుంచి 30 వరకు ఆమోదించబడిన దరఖాస్తుదారుల ఈకేవైసీని పొందడం ద్వారా ప్రొసీడింగ్‌లు జారీ చేస్తారు. దీని ప్రకారం దరఖాస్తుదారుడు ఇప్పటికే పాస్ పుస్తకం కలిగి ఉంటే దాకాన్ని ఆధునికీకరిస్తారు. లేదంటే కొత్త పాస్‌బుక్ జారీ చేస్తారు.

ఇలా పరిశీలన..

రెవెన్యూ రికార్డులతో పాటు క్షేత్ర స్థాయి తనిఖీతో దరఖాస్తులను ధ్రువీకరించడానికి తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్ లేదా గిర్దావర్, సర్వేయర్, జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ నేతత్వంలో బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి బృందానికి నాలుగు రెవెన్యూ గ్రామాలను కేటాయించారు. ఖమ్మం ఆర్డీఓ జారీ చేసిన నోటీసులను దరఖాస్తుదారులకు అందజేయడంతోపాటు ఎవరైనా అభ్యంతరం తెలియజేయదలిస్తే ఏడు రోజుల్లోపు నేలకొండపల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో డాక్యుమెంటరీ ఆధారాలను సమర్పించాల్సి ఉంటుంది. ఈ మేరకు గ్రామ పంచాయతీలు, ఎంపీడీఓ, తహసీల్దార్, వ్యవసాయ కార్యాలయాలతో పాటు పోలీస్ స్టేషన్ నోటీసు బోర్డుల్లో ప్రదర్శించారు.

వసతుల కల్పనకు కృషి

- రూ.128 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం
- భూమి పూజ చేసి పనులు ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి



పనులు ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

మధిర: మధిర పట్టణ ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం చర్యలు చేపడుతుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. స్థానిక సుందరయ్య నగర్‌లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఆదివారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మధిరలో అండర్ డ్రెయినేజీ ఏర్పాటు చేయాలనే ప్రజల చిరకాల కోరిక నెరవేర్చడానికి రూ.128 కోట్లు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నిధులు సమకూరుస్తున్నట్లు తెలిపారు. యూజీడీలో భాగంగా 99.56 కిలోమీటర్ల మేర సీవరేజ్ పైప్‌లైన్, 6,638 గృహాలకు కనెక్షన్, నాలుగు సీవరేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. పాత డంపింగ్ యార్డ్ వద్ద రాయపట్నం రోడ్డులో 5 ఎంఎల్‌డీ ఎస్‌టీపీ, మడుపల్లిలో 0.9 ఎంఎల్‌డీ ఎస్‌టీపీ, మధిర లేక్ వద్ద అంబారుపేటలో 0.4 ఎంఎల్‌డీ ఎస్‌టీపీ, ఇల్లందులపాడు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ వద్ద 0.5 ఎంఎల్‌డీ ఎస్‌టీపీ నిర్మించనున్నట్లు వివరించారు. మధిరలో మేజర్ స్టార్మ్ వాటర్ డ్రైన్, ఆర్‌సీసీ రిటైనింగ్ వాల్, ఓసీఈఎంఎస్ పరికరాల అమరిక పనులను రెండేళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు. ఆ తర్వాత ఐదేళ్ల పాటు నిర్మాణ సంస్థే నిర్వహణ బాధ్యతలు చూడాల్సి ఉంటుందన్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులను ఆదేశించారు. మధిర పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేలా అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టామని, గ్రామీణ ప్రాంతాల్లోనూ మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు, మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, వెంకటరమణ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన



రామలింగేశ్వర ఆలయ నిర్మాణ పనుల మ్యాప్ పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

వైరా: వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదివారం పర్యటించారు. తన స్వగ్రామమైన లక్ష్మీపురంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో చేపట్టిన స్నానాల ఘాట్, గదులు, ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆలయ సమీపంలో వైరా నదిపై నిర్మించనున్న రిటైనింగ్ వాల్, చెక్‌డ్యామ్, ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశిత గడువు లోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుక రావాలని అధికారులకు సూచించారు.

నేటి నుంచి బోనకల్ మండలంలో...

ఖమ్మం సహకారనగర్ : బోనకల్ మండలంలో సోమవారం నుంచి ఈనెల 16వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం రెండు బృందాలను ఏర్పాటు చేశామని, ఒక బృందానికి బోనకల్ తహసీల్దార్, మరో బృందానికి మధిర తహసీల్దార్ నేతృత్వం వహిస్తారని పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సులు కొనసాగుతాయని, భూ సమస్యలు ఉన్న రైతులు లిఖితపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. 5వ తేదీన గార్లపాడు, 6న సీతానగరం, తూటికుంట్ల, 7న రామాపురం, జానకీపురం, 8న బోనకల్, పెద్ద బీరవల్లి, 9న చొప్పకట్లపాలెం, నారాయణపురం, 10న చిరునోముల, మోటమర్రి, 11న గోవిందాపురం(ఎల్), కలకోట, 12న లక్ష్మీపురం, రాయనపేట, 13న రావినూతల, రాపల్లి 14న ముష్టికుంట్ల, బ్రాహ్మణపల్లి, 15న ఆళ్లపాడు, చిన్నబీరవల్లి, 16న గోవిందాపురం (ఎ) గ్రామాల్లో సదస్సులు నిర్వహించనున్నట్లు వివరించారు.

తగ్గిన ఉష్ణోగ్రతలు



ఖమ్మంవ్యవసాయం: రెండు రోజులుగా ఈదురు గాలులతో పాటు వర్షం కురవడంతో జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తగ్గాయి. దీంతో వాతావరణం చల్లబడింది. ఈనెల 6, 7 తేదీల వరకు ఇలాగే ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. శనివారం ఎర్రుపాలెంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 42.5 డిగ్రీలు, అత్యల్పంగా ఏన్కూరు మండలం తిమ్మారావుపేటలో 38.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆదివారం నాగులవంచలో గరిష్ఠంగా 37.3 డిగ్రీలు, రావినూతలలో 37.3, వైరా ఏఆర్ఎస్ 36.8, కుర్నవల్లి, వైరా, తల్లాడలో 36.5, ఏన్కూరులో 35.9, కూసుమంచి 35.7, లింగాల, గేటు కారేపల్లిలో 35.6, బచ్చోడులో 35.4, పల్లెగూడెంలో 35.3, కాకరవాయిలో 35.2, పమ్మిలో 35.1, తిమ్మారావుపేట, రఘునాథపాలెంలో 34.9, బాణాపురం, పెనుబల్లిలో 34.8, పంగిడిలో 34.6, నేలకొండపల్లిలో 34.5, ఖమ్మం ఖానాపురం, ప్రకాశ్‌నగర్, తిరుమలాయపాలెం, చింతకానిలో 34.2, ఖమ్మం ఎన్‌ఎస్‌టీ గెస్ట్‌హౌస్ వద్ద 34.1, పెద్దగోపతిలో 34 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా, అకాల వర్షాలతో వరి, మొక్కజొన్న, మామిడి, బొప్పాయి, కూరగాయల పంటలు దెబ్బతింటుండగా రైతులు ఆందోళన చెందుతున్నారు.

‘ఉపాధి’పై నిఘా..



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- పనుల పర్యవేక్షణకు కమిటీలు
- ఐదుగురు సభ్యులతో వీఎంసీల ఏర్పాటుకు ప్రభుత్వ నిర్ణయం
- జిల్లాలోని 589 జీపీల్లో ప్రతిపాదనలు..

ఖమ్మంమయూరిసెంటర్: గ్రామీణ ప్రాంత కూలీలకు పనులు కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నారు. తద్వారా జిల్లాలో లక్షలాది మంది ఉపాధి పొందుతున్నారు. ఈ పథకాన్ని పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. గ్రామీణ స్థాయిలో ఉపాధి హామీ పనులపై నిఘా పెట్టేందుకు చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో గ్రామ స్థాయిలోనే పథకం పనుల పర్యవేక్షణకు విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ(వీఎంసీ)లను ఏర్పాటు చేస్తుంది. పనుల పర్యవేక్షణతో పాటు సామాజిక తనిఖీ నివేదికలపై ఎప్పటికప్పుడు సమీక్ష జరిపి అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేలా ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే జిల్లాలో ఇప్పటికే ఈ ప్రక్రియకు అడుగులు పడగా.. వీఎంసీలు పూర్తి స్థాయిలో పనిచేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఐదుగురితో కమిటీ..

ప్రతి గ్రామపంచాయతీలో ఐదుగురు సభ్యులతో వీఎంసీలు ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన వారితో పాటు సగం మంది మహిళలు ఉండేలా నిర్ణయించారు. ఇక వీఎంసీ సభ్యులుగా గ్రామంలో పని చేసే ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, రిసోర్స్ పర్సన్లు, సివిల్ క్లబ్ సంఘాల సభ్యులు ఉండేలా చూస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని 589 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు కమిటీలను ప్రతిపాదిస్తూ డీఆర్‌డీఏ అధికారులకు నివేదికలు పంపగా.. జిల్లా అధికారులు కలెక్టర్ ద్వారా రాష్ట్ర అధికారులకు పంపించారు. ఈ కమిటీలు ఆరు నెలల పాటు పని చేసేలా ప్రతిపాదనల్లో పేర్కొన్నారు.

పనుల పరిశీలన ఇలా..

ఉపాధి పనులు పారదర్శకంగా జరిగేలా చూసేందుకు వీఎంసీ కమిటీలు నిరంతరం పర్యవేక్షణ చేయనున్నాయి. వారానికి ఒకసారి ఉపాధి హామీ పనులను పరిశీలించనున్నాయి. ఇక ప్రతి నెల మూడో శుక్రవారం పంచాయతీ కార్యదర్శితో కలిసి ఉపాధి కూలీలు, సిబ్బందితో సమావేశం కానున్నారు. పనుల నిర్వహణపై కూలీలతో చర్చించనున్నారు. ఉపాధి రికార్డులను, సౌకర్యాలను పరిశీలించడంతో పాటు పనుల నాణ్యత, వ్యయాన్ని అంచనా వేయడం, జరిగిన పనిపై నివేదిక ఇవ్వడం, పనుల తనిఖీ, లెక్కింపు, పనులను రిజిస్టర్‌లో నమోదు చేయడం వంటివి కమిటీలు చేయాల్సి ఉంది. ఇక సోషల్ ఆడిట్ సమయంలో కమిటీలు ఆ నివేదికలను ప్రవేశపెట్టాల్సి ఉండగా సోషల్ ఆడిట్ అధికారులు వాటిని పరిగణనలోకి తీసుకోవాలి. కమిటీలు ఇచ్చే నివేదికలను బట్టి అధికారులు చర్యలకు ఉపక్రమించాలి. వీఎంసీ కమిటీల పర్యవేక్షణతో పనులు మరింత పారదర్శకంగా జరుగుతాయని జిల్లా అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో ఉపాధి కూలీల వివరాలు

జాబ్ కార్డులు	3.06 లక్షలు
కూలీల సంఖ్య	6.43 లక్షలు
యాక్టివ్ జాబ్‌కార్డులు	1.83 లక్షలు
యాక్టివ్ కూలీలు	3.08 లక్షలు

క్లుప్తంగా

సెడార్ వ్యాలీ పాఠశాలలో వైమానిక శిక్షణ



వైమానిక శిక్షణ పొందుతున్న విద్యార్థులు

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెంలో ఉన్న సెడార్ వ్యాలీ ఇంటర్నేషనల్ పాఠశాలలో ఆదివారం స్పేస్ జెన్ సంస్థతో కలిసి వైమానిక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. హార్వెస్ట్ విద్యాసంస్థలకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొన్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. కాక్‌పిట్, సిమ్యులేటర్ ద్వారా విద్యార్థులు విమానం టేకాఫ్, లాండింగ్, ఫ్లయింగ్ విభాగాల్లో శిక్షణ పొందారు. శిక్షణ అనంతరం విద్యార్థులకు కరస్పాండెంట్ రవిమారుత్, అకడమిక్ అడ్వయిజర్లు పార్వతీరెడ్డి, ఉదయశ్రీ ధ్రువపత్రాలు అందించారు.

ప్రజా సమస్యలను పార్లమెంట్‌లో వినిపిస్తున్నా..

ఎంపీ రామసహాయం రంఘురాంరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజా సమస్యలను పార్లమెంట్‌లో వినిపిస్తూ, వాటి పరిష్కారం దిశగా పనిచేస్తున్నానని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమది తొలి నుంచి ప్రజలతో ముడిపడిన జీవితమని, మున్నేరు వరదలప్పుడు సైతం అనేక కాలనీల్లో సహాయక చర్యల్లో పాల్గొని, నిత్యావసరాలు పంపిణీ చేశానన్నారు. జిల్లా అభివృద్ధే లక్ష్యంగా జాతీయ రహదారులు, సర్వీస్ రోడ్లు, అండర్‌పాస్‌ల రూపకల్పనకు కృషిచేశానని, కొత్తగూడెం ఎయిర్‌పోర్ట్ అంశాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, తాను తిరిగి ఫైల్ తెరిపించి విమానయాన శాఖ అధికారులను సర్వేకు పిలిచానని పేర్కొన్నారు. పాలేరులో ప్రత్యామ్నాయ రైల్వే రూట్, పులిగుండాల ఎకో టూరిజం పార్క్, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యలపై తాను గళం విప్పానని స్పష్టం చేశారు.

ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని ఆందోళన



రాస్తారోకోలో పాల్గొన్న రైతులు

కూసుమంచి: అకాల వర్షాలు వస్తున్నందున ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, కాంటాలు వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం పాలేరులో రైతులు ఖమ్మం – సూర్యాపేట రహదారిపై రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న అధికారులు అక్కడకు చేరుకుని రైతులతో మాట్లాడారు. ఎస్ఐ నాగరాజు అప్పటికప్పుడు జాతీయ రహదారిపై వెళ్తున్న లారీలను ఆపి కొనుగోలు కేంద్రానికి తరలించారు. గన్నీ బ్యాగులను కూడా తీసుకొచ్చి కాంటాలు వేయటంతో పాటు ధాన్యాన్ని లారీల్లో తరలించటంతో రైతులు ఆందోళన విరమించారు.

డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డుపై పడిన లారీ



రోడ్డుపై పడిపోయిన లారీ

రఘునాథపాలెం: ఖమ్మం నుంచి రాజమండ్రికి వెళ్తున్న లారీ ఆదివారం ఉదయం మండలంలోని వీవీపాలెం సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డుపై పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని తెలిసింది. రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ ఘటనా ప్రాంతానికి చేరుకుని లారీని పక్కకు తరలించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

కేసు నమోదు

బోనకల్: ప్రభుత్వ పాఠశాలలో జూదం ఆడుతున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పొదిలి వెంకన్న తెలిపారు. మండలంలోని ఆళ్లపాడు పాఠశాలలో కొన్ని రోజులుగా కొందరు జూదం ఆడుతున్నట్లు సమాచారం అందగా ఎస్ఐ అక్కడికి చేరుకుని, ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,700 స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కిన్నెరసానిలో జలవిహారం

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్‌పైనుంచి జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. రిజర్వాయర్‌లో జలవిహారం చేశారు. 535 మంది పర్యాటకులు కిన్నెరసానిలో ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖ రూ.29,600 ఆదాయం లభించగా, 200 మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.10,400 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

కాల్వలు అధ్వానం..



తల్లాడ మైనర్ కాల్వలో దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు

తల్లాడ మండలంలో ఎన్నెస్పీ కాల్వల వివరాలు

ఆయకట్టు	21 వేల ఎకరాలు
గ్రామాలు	41
మేజర్ కాల్వలు	06
మైనర్లు	34
సిరిపురం మేజర్	18.587 కి.మీ.
రామచంద్రాపురం	7.625 కి.మీ.
గూడూరు-1	2.400 కి.మీ.
గూడూరు-2	3.600 కి.మీ.
పుణ్యపురం	6.307 కి.మీ.
బస్వాపురం	4.840 కి.మీ.

ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు?

- గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలతో కమ్మేసిన సాగర్ కాల్వలు
- పదేళ్లుగా కరువైన మరమ్మతులు
- ఫలితంగా చివరి భూములకు అందని సాగర్ నీరు
- ఈ వేసవిలోనైనా మరమ్మతులు చేస్తే ఉపయోగం

తల్లాడ: 1977లో నిర్మించిన నాగార్జున సాగర్ (ఎన్నెస్పీ) కాల్వలు పదేళ్లుగా మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా తయారయ్యాయి. మేజర్, మైనర్ కాల్వల్లో గుర్రపు డెక్క, చెత్త చెదారం, పూడిక పేరుకుపోయి పిచ్చి మొక్కలు, కంప చెట్లు దట్టంగా పెరిగి సాగునీటి సరఫరాకు అడ్డుపడుతున్నాయి. మేజర్ కాల్వలపై ఆధారపడి మండలంలోని సిరిపురం, రామచంద్రాపురం, గూడూరు–1, 2, పుణ్యపురం, బస్వాపురం గ్రామాల్లో పంటలు పండిస్తున్నారు. వీటి కింద పలు మైనర్లు, సబ్ మైనర్లు కూడా ఉన్నాయి. కానీ, ఈసారి చివరి భూముల రైతులకు తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడింది. వారు రేయింబవళ్లు, కాల్వల వెంట తిరిగి నీరు పెట్టుకోవాల్సి వచ్చింది. అందుకు కారణం పదేళ్లుగా సాగర్ కాల్వలకు శాశ్వత మరమ్మతులు చేయకపోవటమే. కాల్వల్లో గుర్రపు డెక్క వ్యాపించింది. పూడిక పేరుకుంది. రెండు పక్కలా పిచ్చి మొక్కలు దట్టంగా మొలిచాయి.

సిబ్బంది కొరత.. పర్యవేక్షణ లోపం

ఎన్నెస్పీ సిబ్బంది కొరత, పర్యవేక్షణ లోపంతో కాల్వల నిండా పిచ్చి మొక్కలు పెరిగి, నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. వేసవిలో లష్కర్లు కాల్వల్లో పిచ్చి మొక్కలు తొలగించాల్సి ఉన్నా.. ఆ సిబ్బంది కొరతతో మొక్కలు బాగా పెరిగాయి. అవి ఇలాగే ఉంటే ఖరీఫ్ సీజన్‌లోనూ నీరందటం కష్టమేనని రైతులు వాపోతున్నారు.

బలహీనంగా డ్రాప్‌లు

మేజర్, మైనర్ కాల్వలకు చెందిన డ్రాపులు, యూటీలు పలుచోట్ల కూలగా ఇప్పటికీ మరమ్మతులు చేయలేదు. కాల్వ కట్టలు బలహీనంగా మారాయి. పలుచోట్ల కోతకు గురై ఎక్కడ గండి పడుతుందోననే ఆందోళన వ్యక్తమవుతోంది. కొలబద్దలు నామరూపాల్లేకుండా పోయాయి.

ఇప్పుడే అనుకూలం

ఏటా ఖరీఫ్‌కు ముందే కాల్వల్లో గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలను తొలగించాలి. పేరుకుపోయిన పూడికను తీయాలి. నిధులే లేక పదేళ్లుగా కాల్వలకు మరమ్మతులు జరగకపోవడంతో 150 క్యూసెక్కుల నీటిని సరఫరా చేయాల్సిన మేజర్లలో 100 క్యూసెక్కులలోపు విడుదల చేస్తున్నారు. ఏటా చివరి ఆయకట్టు రైతులు కాల్వల చుట్టూ తిరగాల్సి వస్తోంది. కాల్వల మరమ్మతులకు ఈ రెండునెలలే అనుకూలం.

కాల్వలను పర్యవేక్షించాలి..



మేజర్ కాల్వల్లో గుర్రపు డెక్క, కంప చెట్లు దట్టంగా పెరిగాయి. నాచు కూడా అల్లుకుపోవడం, పూడిక పెరగడంతో నీటి సరఫరా సరిగ్గా జరగడం లేదు. వెంటనే వీటిని తొలగించాలి. కాల్వలు బాగోలేక 100 క్యూసెక్కుల లోపు నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తే సమస్యలు తొలగిపోతాయి. –సున్నం రాము, రైతు, తల్లాడ

మరమ్మతులు చేయాలి..



ఏటా కాల్వల ద్వారా చివరి భూములకు నీరందటం లేదు. సీజన్ ముగిసిన తర్వాత కాల్వలను బాగు చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. కాల్వల్లో చెత్తా, చెదారం పేరుకుపోతుంది. నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. ఈ ఏడాది రబీలో సాగు నీరందక వరి వేయాల్సిన మాగాణిలో గోంగూర సాగు చేయాల్సి వచ్చింది. –కొమ్ము లక్ష్మయ్య, రైతు, బిల్లుపాడు

ప్రతిపాదనలు పంపించాం..



తల్లాడ సబ్ డివిజన్ పరిధిలో కాల్వలకు మరమ్మతులు అవసరమే. ప్రతిపాదనలు పంపాం. మేజర్ కాల్వల్లో జంగిల్ క్లియరెన్స్, కాల్వ గేట్ల మరమ్మతులకు అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు అందజేశాం. కాల్వ కట్టలు పటిష్ట పర్చేందుకు, పూడిక తీత పనులకు కూడా అంచనాలు తయారు చేసి పంపిస్తాం. –వి.శ్రీనివాసరావు, డీఈ, నీటి పారుదల శాఖ

సజావుగా సాగింది..

జిల్లాలో ‘నీట్’ ప్రశాంతంగా సాగింది. ఉదయం పదిన్నర గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులతో తల్లిదండ్రులు తోడుగా వచ్చి.. పరీక్ష హాల్లోకి పంపించారు. నిర్వాహకులు విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించాకే అనుమతించారు. ఒకరిద్దరు విద్యార్థులు చివరి క్షణంలో ఉరుకులు, పరుగులు పెడుతూ పరీక్ష కేంద్రానికి వచ్చారు. –స్టాఫ్ ఫొటోగ్రాఫర్..



కుమార్తెతో సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి..



నంబర్ చూసుకుంటూ..





ముక్కుపుడక తీయాలి



గాజులు కూడా..



దిద్దులూ పెట్టుకోవద్దు..



బాగా రాయి తల్లి..



మంచి ర్యాంక్ రావాలి..

గంజాయి ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న రిత్విక్‌సాయి

మధిర: ఒడిశా రాష్ట్రం నుంచి మధిరకు గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్న ముఠాను మధిర టౌన్ ఎస్‌హెచ్‌ఓ, ట్రైనీ ఐపీఎస్ కొట్టే రిత్విక్‌సాయి అదుపులోకి తీసుకున్నారు. వివరాలను ఆదివారం టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆయన వెల్లడించారు. ఈ నెల 2న అత్కూర్ క్రాస్ రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీస్ వాహనాన్ని చూసి ద్విచక్ర వాహనంపై బ్యాగులతో వస్తున్న ఇద్దరు వ్యక్తులు పారిపోయేందుకు యత్నించారు. వారిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా బ్యాగుల్లో సుమారు రూ.2 లక్షల విలువ చేసే 4 కేజీల గంజాయి దొరికింది. ఒడిశా రాష్ట్రంలోని పుష్పలంక ప్రాంతవాసి హంటర్ మధు నుంచి మధిర పట్టణానికి చెందిన మర్రి సుజిత్, తమ్మిశెట్టి ఏసుబాబు గంజాయి కొనుగోలు చేసి, ఇక్కడికి తీసుకొచ్చి 9 మందికి విక్రయించారని, వారు చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి పట్టణంలోని యువతకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. వీరు ఇన్‌స్టాగామ్ యాప్ ద్వారా మాట్లాడుకుంటూ గంజాయి రవాణా చేస్తున్నారని, మొత్తం 12 మందిపై కేసు నమోదు చేశామని రిత్విక్‌సాయి వెల్లడించారు. మర్రి సుజిత్, తమ్మిశెట్టి ఏసుబాబును రిమాండ్‌కు తరలించామని, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామని వివరించారు.

ఇసుక తరలిస్తున్న వాహనాలు సీజ్

ఏపీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా తెలంగాణకు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 3 టిప్పర్లు, ఎస్కార్ట్‌గా వస్తున్న మరో 3 వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు మధిర ఎస్‌హెచ్‌ఓ, ట్రైనీ ఐపీఎస్ కొట్టే రిత్విక్‌సాయి తెలిపారు. ఆదివారం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 2న అర్ధరాత్రి ఏపీలోని నందిగామ మీదుగా తెలంగాణకు అనుమతులు లేకుండా వస్తున్న 3 ఇసుక టిప్పర్లు, వాటికి ఎస్కార్ట్‌గా వస్తున్న 3 వాహనాలను రాయపట్నం సమీపంలో పట్టుకున్నారు. వాహనాల యజమాని, ఒక కాంట్రాక్టర్, 9 మందిపై కేసు నమోదు చేసి 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అదనపు ఎస్ఐ చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడికి యత్నం..!

మధిర: పట్టణంలోని స్టేషన్‌రోడ్‌లో బాలికపై సమీప బంధువు శనివారం రాత్రి లైంగికదాడికి యత్నించినట్లు సమాచారం. స్థానిక శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో ఉంటున్న ఓ మహిళ పలు ఇళ్లలో పనిచేస్తూ కుమార్తెను చదివిస్తోంది. కుమారుడు కూలి పనులకు వెళ్తుంటాడు. కుమారుడికి కిడ్నీలో స్టోన్ ఉండగా చికిత్స కోసం శనివారం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. బాలిక ఇంట్లో ఉండగా తన చిన్నమ్మ భర్త (బాబాయి) శనివారం రాత్రి ఇంటికి వచ్చి చేతులు, కాళ్లు తాళ్లతో కట్టి.. నోట్లో గుడ్డలు కుక్కి లైంగికదాడికి యత్నించినట్లు సమాచారం. బాలిక కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రాగా సదరు వ్యక్తి పరారయ్యాడు. ఆదివారం బాలిక తల్లి మధిర టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మట్టగుంజ సతీశ్ (ఫైల్)

మధిర: దెందుకూరు రైల్వే ఓవర్ బ్రిడ్జిపై శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎర్రుపాలెం మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన మట్టగుంజ సతీశ్ (23) మధిర పట్టణంలోని ఫర్నిచర్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై మధిర నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ఎదురుగా వచ్చిన టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. సతీశ్ అక్కడికక్కడే మృతి చెందగా.. సమాచారం అందుకున్న ఆర్కే ఫౌండేషన్ అధ్యక్షులు దోర్నాల రామకృష్ణ మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రూరల్ ఎస్ఐ లక్ష్మీభార్గవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

భార్య మృతి.. భర్త, కుమార్తె పరిస్థితి విషమం



సంధ్య (ఫైల్)



చికిత్స పొందుతున్న సాడియం బ్రహ్మ

ఏన్కూరు: బైక్‌ను వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో వివాహిత మృతిచెందగా.. ఆమె భర్త, కుమార్తె పరిస్థితి విషమంగా మారింది. ఈ ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రామ తండాకు చెందిన సాడియం బ్రహ్మ ఆయన భార్య సంధ్య, కూతురు అమృత కలిసి ద్విచక్రవాహనంపై ఏన్కూరు ప్రధాన సెంటర్‌కు రాగానే మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. స్థానికులు 108 ద్వారా ముగ్గురిని ఆస్పత్రికి తరలిస్తుండగా సంధ్య (38) మృతి చెందింది. భర్త, కూతురు పరిస్థితి కూడా విషమంగా ఉంది. ఘటనా స్థలానికి ఎస్ఐ రఫీ చేరకుని, కేసు నమోదు చేశారు.

తక్కువ ధరకు బంగారం అంటూ టోకరా..

సినీ ఫక్కీలో రూ.10 లక్షలు చోరీ

కారేపల్లి: తక్కువ ధరకు.. ఎక్కువ బంగారం.. అంటూ ఆశచూపిన కేటుగాళ్లు నకిలీ బంగారం అంటగట్టి.. రూ.10 లక్షలు చోరీ చేసిన ఘటన కారేపల్లిలో ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. బస్టాండ్ సెంటర్‌కు చెందిన ఓ జ్యూస్ పాయింట్ వ్యాపారికి ఓ సైబర్ దుండగుడు ఫోన్ చేసి.. ‘సార్.. మీ మొబైల్ నంబర్‌కు బంగారం ఆఫర్ వచ్చింది. ఏపీలోని ఏలూరులో 20 తులాల బంగారం కేవలం రూ.10 లక్షలే’అని తెలిపాడు. వారం రోజులుగా పదే పదే ఫోన్ చేసి.. అలాగే చెప్పారు. దీంతో బాధితుడు ఆఫర్‌ను వదులుకోవద్దని ఖమ్మంలో తనకు తెలిసిన, ఓ బంగారం దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్న తన స్నేహితుడు, రూ.10 లక్షలు తీసుకుని కారులో ఏలూరు వెళ్లారు. ఓ అపార్ట్‌మెంట్‌లో దుండగులను కలవగా.. వారు సూట్‌కేసులో 20 తులాల బంగారం పెట్టి ఇచ్చారు. బాధితుడి వెంట వచ్చిన వ్యక్తికి బంగారం షాపులో పనిచేస్తున్న అనుభవం ఉండటంతో పరీక్షించి ఒరిజినలే అని భావించి, తూకం వేశారు. ఈ క్రమంలోనే అక్కడే ఉన్న ఒకడు పోలీసులు వస్తున్నారని అరిచాడు. అనంతరం సూట్‌కేసులు తారుమారు చేశారు. బాధితులు అక్కడి నుంచి కారు ఎక్కి తిరుగు పయనమయ్యారు. ఏలూరు దాటాక కారు ఆపి సూట్‌కేసు తెరిచి చూడగా నకిలీ బంగారపు వస్తువులు చూసి ఖంగుతున్నారు. తిరిగి అక్కడివే వెళ్లగా వారు లేక పోగా.. ఫోన్ కూడా కలవలేదు. కానీ, బాధితులు ఇప్పటివరకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు.

ఖమ్మం మహిళ హైదరాబాద్‌లో మృతి

భర్తే కొట్టి చంపాడని అనుమానాలు



భర్త అనిల్‌తో సాహితి (ఫైల్)

ఖమ్మంక్రైం: వరుసకు వదిన అయిన మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్న ఓ వ్యక్తి తన భార్యను కొట్టి చంపినట్లు సమాచారం. ఈ ఘటన హైదరాబాద్‌లో జరగగా.. మృతురాలిది ఖమ్మం. వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణానికి చెందిన సాహితి (30)కి ఖమ్మం పట్టణానికి చెందిన రేగుల అనిల్‌తో కొన్నేళ్ల కిందట వివాహమైంది. అనిల్ హైదరాబాద్‌లోని పోలీస్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండటంతో దంపతులు అక్కడే ఉంటున్నారు. కాగా, అనిల్ వరుసకు వదిన అయిన మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తుండగా దంపతుల మధ్య గొడవలు మొదలయ్యాయి. పద్ధతి మార్చుకోవాలని పెద్దల సమక్షంలో హెచ్చరించినా మార్పు రాలేదు. శనివారం రాత్రి సాహితిని విపరీతంగా కొట్టడంతో ఆమె మృతిచెందగా గుండెపోటుతో మృతిచెందినట్లు చిత్రీకరించేందుకు అనిల్ యత్నించాడని మృతురాలి బంధువులు ఆరోపించారు. మృతురాలి శరీరంపై కూడా గాయాలున్నాయని, హైదరాబాద్ నుంచి మృతదేహాన్ని తీసుకొచ్చి ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. సీఐ బాలకృష్ణ వారితో మాట్లాడి అనిల్‌పై ఫిర్యాదు చేయాలని, పోస్టుమార్టంలో హత్య అని తేలితే కేసు నమోదు చేస్తామని, సర్దిచెప్పగా మృతదేహాన్ని ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. టూటౌన్ పోలీసులు ఫిర్యాదు స్వీకరించారు. అనిల్ పరారీలో ఉన్నాడు. వారికి ఇద్దరు పిల్లలున్నారు.

ఆర్టీసీ బస్సు, కారు ఢీ

ఒకరు మృతి



బ్రహ్మయ్య (ఫైల్)



ప్రమాదానికి ముందు స్నేహితులతో బ్రహ్మయ్య

చింతకాని: మండలంలోని తిరుమలాపురం క్రాస్ రోడ్డు సమీపంలో ఆదివారం రాత్రి ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్న ఘటనలో మధిర పట్టణానికి చెందిన పసుపులేటి వెంకటసాయి అలియాస్ బ్రహ్మయ్య (28) మృతి చెందగా వేపూరి శబరీశ్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. బోనకల్ వైపు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారు, ఖమ్మం నుంచి బోనకల్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు తిరుమలాపురం క్రాస్ రోడ్డు సమీపంలోకి రాగానే ఢీకొన్నాయి. కారు డ్రైవింగ్ చేస్తున్న బ్రహ్మయ్య అక్కడికక్కడే మృతి చెందగా, కారులో ఉన్న శబరీశ్‌కు గాయాలయ్యాయి. ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కారులో ఇరుక్కుపోయిన మృతదేహాన్ని స్థానికుల సాయంతో బయటకు తీసి, ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కారు నడుపుతున్న సమయంలో బ్రహ్మయ్య మద్యం మత్తులో ఉన్నట్లు సమాచారం. మృతుడి స్వగ్రామం ఎర్రుపాలెం మండలం మొలుగుమాడు కాగా, తల్లిదండ్రులు మధిరలో నివాసం ఉంటున్నారు. బ్రహ్మయ్య, శబరీశ్ ఎర్రవరంలోని ఆలయ దర్శనానికి వెళ్లి ఖమ్మం వస్తుండగా ప్రమాదం జరిగింది. కాగా, బస్సు పక్కకు దూసుకుపోయి రాయికి గుద్దుకుని ఆగింది. ఆ పక్కనే వ్యవసాయ బావి ఉంది. బస్సులో 80 మంది ప్రయాణికులు ఉన్నారు. రాయికి తగలకపోతే బస్సు బావిలో పడేదని ప్రయాణికులు తెలిపారు.